క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి

తానూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్(ఎన్‌కేవైఎస్) కోఆర్డినేటర్ బంక కిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని బోరాగాం గ్రామ మైదానంలో ఎన్‌కేవైఎస్ ఆధ్వర్యంలో బ్లాక్‌లెవల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన బోరిగాం శ్రీరాం జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

కుభీర్ ఎంపీవోగా గోవర్ధన్

కుభీర్: మండల ఎంపీవో(మండల పంచాయతీ అధికారి)గా సోమవారం గోవర్దన్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మామడ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గోవర్ధన్ గతంలోనూ కుభీర్ ఈవో, ఎంపీవోగా పని చేశారు.

ఎల్ఈడీ బల్బులు అందజేత


బల్బు అందిస్తున్న రాజేందర్

నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్(జి)గ్రామానికి చెందిన డాక్టర్ రాజేందర్ దత్తాత్రేయ మందిరానికి వెళ్లే మార్గంలో అమర్చేందుకు సుమారు రూ.20వేల విలువైన 15 ఎల్ఈడీ బల్బులను అందించారు. సొంత నిధులతో బల్బులు అందించిన రాజేందర్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు. కాంట్రాక్టర్ వినోద్‌రెడ్డి, శ్రీనివాస్, నగేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షప్యాడ్లు అందజేత


విద్యార్థులతో గంగాధర్, తదితరులు

కడెం: మండలంలోని లింగాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుర్ర గంగాధర్(డబ్బు)యాదవ్ రూ.ఏడు వేల విలువైన పరీక్షప్యాడ్లు, కాంపాక్స్ బాక్సులు, వాటర్ బాటిళ్లు అందజేశారు. తన తాతయ్య కుర్ర శివయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు వీటిని అందించినట్లు పేర్కొన్నారు. కుర్ర భరత్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మహేశ్వర్, లక్ష్మణ్, గంగారాం, నరేశ్, గంగన్నచారి, రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్: అనుమతి లేకుండా పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడని.. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ఎస్సైకి సన్మానం


ఎస్సై రాజుతో వీడీసీ సభ్యులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజును సోమవారం లోకేశ్వరం వీడీసీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అంబకంటి శ్రీనివాస్, కుమ్మరి విఠల్, భోజన్న, రామారావు, రాజాశేఖర్ తదితరులున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని ఎస్సై కోరారు.

వేతనాలు చెల్లించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

కుభీర్: తమకు వేతనాలు చెల్లించాలని మండలంలోని పల్సి, సిర్పెల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో గోవర్దన్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని.. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీవో జీతాలు త్వరగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణ ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలతోపాటు కుల సంఘ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చైర్మన్, వైస్‌చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు ఉన్నారు.

పశువైద్యం అందని ద్రాక్షే..!


లోకేశ్వరంలోని పశువైద్యశాల భవనం


పొట్టేలుకు చికిత్స చేస్తున్న కాపరి గంగాధర్

- శిథిలావస్థకు పశువైద్యశాలలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బంది పడుతున్న పోషకులు

లోకేశ్వరం: మూగజీవాలకు టీకాల పంపిణీ, వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పశువైద్యశాలలను ఏర్పాటు చేసింది. కానీ లోకేశ్వరం మండలంలో ఉన్న లోకేశ్వరం, కన్కపూర్ పశువైద్యశాలల్లో పూర్తిస్థాయి వసతులు, సిబ్బంది లేక జీవాలకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం మండలంలో 25 గ్రామపంచాయతీలున్నాయి. వాటి పరిధిలో ఆవులు 12వేలు, గేదెలు తొమ్మిదివేలు, గొర్రెలు 67వేలు, మేకలు 5వేలు ఉన్నాయి. పశువుల సంఖ్య ప్రకారం మండలంలో రెండు పశువైద్యశాలలు, ఆరు ఉపకేంద్రాలు ఉండాలి. కానీ ప్రస్తుతం లోకేశ్వరం, కన్కపూర్‌లో పశువైద్యశాలలు ఉన్నాయి. లోకేశ్వరం పశువైద్యశాలలో పశువైద్యాధికారి, సహాయకుడు, అటెండర్ విధులు నిర్వర్తిస్తున్నా.. కన్కపూర్ ఆసుపత్రిలో మాత్రం ఒక్క అటెండరే విధులు నిర్వర్తిస్తున్నారు.


పశువుల మంద

పశుపోషకులకు ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల్లో మూగ జీవాలకు వైద్యం అందించడంతోపాటు టీకాల పంపిణీ, అవగాహన కార్యక్రమాల నిర్వహణలో పశువైద్యశాలలు, సిబ్బంది కీలకం. అత్యవసర పరిస్థితుల్లో రైతుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ పశువైద్యశాలల్లో సరిపడ సిబ్బంది లేకపోవడంతో పోషకులు ఇబ్బంది పడుతున్నారు. పశువులు రోగాల బారిన పడితే మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకురావాల్సి వస్తోంది. ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం కారణంగా ఆసుపత్రి భవనం కిందికి వెళ్లిపోయి శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా పైకప్పు నుంచి నీరు గదుల్లోకి చేరి రికార్డులు తడిసిపోతున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ఆసుపత్రి దగ్గరగా వేయడంతో అక్కడ చికిత్స చేయాలంటే వైద్య సిబ్బంది భయపడుతున్నారు.

మేమే వైద్యం చేస్తున్నాం



గ్రామాలకు పశువైద్య సిబ్బంది రాకపోవడంతో మా జీవాలు రోగాల బారిన పడితే మేమే వైద్యం చేసుకుంటున్నాం. మండలంలో పశువైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి మా సమస్య పరిష్కరించాలి.

– సొల్లు పోశెట్టి, కాపరి, ధర్మోర

ఇబ్బందుల్లేకుండా చర్యలు



రైతులకు అందుబాటులో ఉండి పశువులకు సకాలంలో వైద్యం అందిస్తాం. జీవాలు రోగాల బారిన పడితే వెంటనే పశువైద్యులకు ఫోన్‌లో సమాచారమిస్తే అక్కడకు చేరుకొని వైద్యం అందిస్తాం. గ్రామాల్లో పశుపోషకులకు ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– జెస్సీ, పశువైద్యాధికారి, లోకేశ్వరం

'ఐకేరెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు'


నిర్మల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


సోన్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ మంత్రి ఐకేరెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా అధికారం కోసం పార్టీలు మారే చరిత్ర ఇంద్రకరణ్‌రెడ్డిదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు చిత్తుగా ఓడిస్తే మూడు నెలలు కాకముందే పార్టీ మారేందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. మాజీ మంత్రిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని రాష్ట్ర అధినాయకత్వానికి తీర్మానం చేసి పంపుతామని పేర్కొన్నారు.

సోన్: అవినీతి ఆరోపణలున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని కాంగ్రెస్ సోన్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారగానే పార్టీలు మారడం ఆయనకు అలవాటేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజనర్సింహరెడ్డి, గడ్డం స్వామి, పెద్దలస్మన్న, గంగాధర్, గౌస్, నర్సారెడ్డి, నరేశ్, సాయన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గంలో డీ1 పట్టాల పేరుతో భూముల కుంభకోణం, మైనింగ్ వ్యాపారం, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు వసూలు చేయడంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం స్వార్థ రాజకీయాల కోసం శ్రీహరిరావుపై ఉన్న కక్షతో బీఆర్ఎస్ వదిలి కాంగ్రెస్‌లో చేరేందుకు మాజీ మంత్రి సిద్ధమవుతున్నారని ఆగహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, భీమన్న, పోతారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: అవినీతి మరకలు అంటిన ఐకేరెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకుంటే తమ మనోభావాలు దెబ్బతింటాయని.. అతడిని పార్టీలోకి రానీయొద్దని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తక్కల విద్యాసాగర్‌రెడ్డి తమ పార్టీ అధిష్టానాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కట్కం రాజారెడ్డి, అర్గుల రమణ, మహేందర్, కోడె విజయ్, బెల్లాల రాజు, బొల్ల దయాకర్, ఎస్‌కే సలీం, శేఖ్ వసీం, సాయన్న పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ మల్లేశ్

ముధోల్: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రానున్న రంజాన్ పండుగలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'పీఎం విశ్వకర్మ'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నర్సాపూర్(జి): కలెక్టర్, డీపీఆర్వో ఆదేశాల మేరకు మండలంలోని టెంబుర్ని గ్రామంలో విశ్వకర్మ యోజన పథకంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటుహక్కు వినియోగం, ఆవశ్యకతలను పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, సూపరింటెండెంట్ అనంత విశ్వేశ్వరరావు, కార్యదర్శి శైలజ, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

సోన్: మండల కేంద్రంలోని శ్రీ గొడిసెర్యాల రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ వ్యవస్థాపకులు సదానంద్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. శివభక్తులు దీక్ష విరమించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

నర్సరీ పరిశీలన

నర్సాపూర్(జి): వేసవి నేపథ్యంలో నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని టెంబుర్ని గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. కార్యదర్శి శైలజ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి నివాళి

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసే ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య ఈనెల 8న హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. సోమవారం పాఠశాల ప్రాంగణంలో వెంకటనర్సయ్య సంతాపసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కుభీర్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగం(గ్రీవెన్స్)లో రేషన్ కార్డులకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చాయి. ఈసందర్భంగా తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్దన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఈవో విజయ్ తదితరులు ఉన్నారు.


లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులున్నా ఫిర్యాదు చేయాలని.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి'

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసినప్పటికీ అనివార్య కారణాలతో అమలు కాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరిగి దరఖాస్తు చేసుకునే వారు ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లును మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరారు. ప్రధానంగా లబ్ధిదారుల ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పవలసి ఉంటుందని పేర్కొన్నారు.

'టీజేఎస్ సమావేశం విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు

కడెం: మండలకేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో ఈనెల 15న నిర్వహించే తెలంగాణ జన సమితి(టీజేఎస్) పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కేంద్ర పథకాలను వివరించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్


పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో సోమవారం లాభార్థి సంపర్క్ అభియాన్ ముధోల్ అసెంబ్లీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారిని ఆయా బూత్‌ల బాధ్యులు తప్పనిసరిగా కలిసి పథకాల ప్రయోజనాలు వివరించాలని సూచించారు. కేంద్రం అమలు చేసిన జన్‌ధన్ యోజన, గరీబ్ కల్యాణ్ అన్నయోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వీధి వ్యాపారులకు అండగా పీఎం స్వనిధి యోజన, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి, ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మూడోసారి మోదీని ప్రధానిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అనంతరం క్యాలెండర్, కరపత్రాలు ఆవిష్కరించారు. మండల కమిటీల బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో లాభార్థి సంపర్క్ అభియాన్ పార్లమెంట్ కన్వీనర్ గాలి రవి, బి.గంగాధర్, భీంరావు, రమేశ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ముత్యం రెడ్డి, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, మండలాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని గంజ్ ప్రాంతంలో కాసరోళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన ప్రవీణ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం


బహుమతి అందిస్తున్న వైస్‌ఎంపీపీ కల్పనా రెడ్డి

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు వైస్ ఎంపీపీ కల్పనారెడ్డి పేర్కొన్నారు. 2022–23లో మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు సోమవారం వడ్యాల్ పాఠశాలలో వైస్ ఎంపీపీ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. వడ్యాల్‌కు చెందిన నల్ల భీమ్‌రెడ్డి జ్ఞాపకార్థం.. ఆయన కొడుకు–కోడలు నల్ల రామిరెడ్డి–కల్పనారెడ్డి ఆధ్వర్యంలో నల్ల విశాల్‌రెడ్డి–లిఖితరెడ్డి, నల్ల వికాస్‌రెడ్డి–అనూషరెడ్డి ప్రతి సంవత్సరం ఈ పురస్కారాలకు సాయం అందజేస్తున్నారు. పిప్పెర లిఖితకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, జెడ్డి మణిదీప్‌కు ద్వితీయ బహుమతి కింద రూ.ఐదు వేలను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ఇన్‌చార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూషణ్, ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం


కుభీర్: తండాలో పనులు ప్రారంభిస్తున్న నేతలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో సోమవారం ఉపాధిహామీ నిధులు రూ.15 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ప్రత్యేకాధికారి రాజమల్లు, వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య ప్రారంభించారు. కార్యదర్శి భూపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గడ్డం స్వామి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, అంకం శ్రీనివాస్, రాజేశ్వర్, సురేందర్, లతీఫ్, టీపీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఖబ్రస్థాన్‌లో ఉపాధి నిధులు రూ.తొమ్మిది లక్షలు, దావూజీనాయక్ తండాలో రూ.2లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బషీర్, ప్రధాన కార్యదర్శి బంక బాబు, యువజన సంఘం మండలాధ్యక్షుడు లవకుశ్, నాయకులు వివేక్, లింగన్న తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం


లక్ష్మణచాందలో కేక్ కట్ చేస్తున్న కార్మికులు


దిలావర్‌పూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

లక్ష్మణచాంద: మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని పంచాయతీలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సామాజిక పరివర్తన మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల మాట్లాడారు. లక్ష్మణచాంద తాజా మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ అరుణారాణి, ఎస్సై సుమాంజలి, సులోచన, దివ్యారెడ్డి, మహిళా కానిస్టేబుల్ దీపికతోపాటు మహిళా కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, ఎంపీఓ అజీజ్‌ఖాన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పొంచి ఉన్న ప్రమాదం



తానూరు: మండలంలోని దాగాం-హంగిర్గా వెళ్లే మార్గంలో దాగాం శివారులో బీటీ రోడ్డు వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి గుంతలు కన్పించక కిందపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91008 53882